క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

కంచికచర్ల: స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10గంటల నుంచి ఎంపీపీ షేక్ మలక్‌బషీర్ అధ్యక్షతన జరుగుతుందని డిప్యూటీ ఎంపీడీఓ ఆనంద కుమారి గురువారం తెలిపారు. సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

శోభాయమానంగా గణేష్ నిమజ్జనం



చిల్లకల్లు(జగ్గయ్యపేట): మండలంలోని చిల్లకల్లులో బొడ్డురాయి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన గణపతి నిమజ్జన కార్యక్రమం శోభాయమానంగా జరిగింది. కేరళ నృత్యాలు, వేష ధారణలతోపాటు ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై గణనాథులను ఉంచి ఊరేగించారు. కార్యక్రమంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని సందడి చేశారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

కార్మికునికి గాయాలు



ముక్త్యాల(జగ్గయ్యపేట): గ్రామంలోని కొహెన్స్ ఫార్మా లిమిటెడ్ కర్మాగారంలో బుధవారం రాత్రి బాయిలర్ కార్మికునికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలలోకి వెళితే.. వత్సవాయి మండలం పెంట్యాలవారి గూడెం గ్రామానికి చెందిన రామకృష్ణ అనే కార్మికుడు కొహెన్స్ ఫార్మా లిమిటెడ్ కర్మాగారంలో బాయిలర్ ఆపరేటర్‌గా పని చేస్తున్నారు. ఈక్రమంలో రాత్రి 10 గంటల సమయంలో విధులకు వచ్చి బాయిలర్ సెక్షన్‌లో పనిచేస్తుండగా ఒక్కసారిగా బాయిలర్ బెల్టులో చేయిపడటంతో రెండు వేళ్లు నుజ్జు నుజ్జయ్యాయి. అతనికి యాజమాన్యం సకాలంలో వైద్యం చేయించకుండా నాలుగు గంటల పాటు కర్మాగారంలోనే ఉంచారు. దీంతో మిగిలిన కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో జగ్గయ్యపేటలోని ప్రైవేట్ ఆస్పత్రిలో రామకృష్ణకు చికిత్స చేయించి, అనంతరం ఇంటికి పంపారు. యాజమాన్యం తీరుపై కార్మికులు, కుటుంబసభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కర్మాగారంలో తరచు ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

గొట్టుముక్కలలో విషజర్వాలపై ఆర్డీఓ ఆరా



గొట్టుముక్కల(కంచికచర్ల): అంటువ్యాధులు ప్రబలకుండా పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు తగిన చర్యలు చేపట్టాలని నందిగామ ఆర్డీఓ కె.బాలకృష్ణ ఆదేశించారు. రెవెన్యూ, మండల పరిషత్ అధికారులు, ఆరోగ్య సిబ్బందితో కలిసి గురువారం ఆయన మండలంలోని గొట్టుముక్కలలో పర్యటించారు. విషజ్వరాలు ఉన్నాయా అంటూ గ్రామస్తులను ఆరా తీశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ విషజ్వరాల బారిన పడినట్లయితే సమీపంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. గ్రామాల్లో బ్లీచింగ్, సున్నం చల్లించాలని దోమలు వ్యాప్తి చెందకుండా నివారణకు ఎబేట్‌ను పిచికారీ చేయించాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. ఆరోగ్య సిబ్బంది గ్రామంలో పర్యటించి ఇంటింటికి వెళ్లి విషజ్వరాల బారిన పడిన రోగులను గుర్తించి వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో సరఫరా అయ్యే తాగునీరు ఎటువంటి కలుషితం లేకుండా చూడాలని పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ ఆనందకుమారి, తహసీల్దార్ నరసింహారావు, ఆర్ఐ వెంకటరెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణంపై అదే మొండి వైఖరి!

- మారని కూటమి పాలకుల తీరు ...
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి నిర్మాణానికి శంకుస్థాపన
- ఏడాదిన్నరగా ప్రారంభానికి నోచుకోని వందపడకల ఆస్పత్రి పనులు
- ప్రస్తుత ఆస్పత్రి ఆవరణలో నేడు మళ్లీ శంకుస్థాపన చేయనున్న వైనం
- పార్కింగ్, ఇతర వసతుల మాటేమిటంటున్న జనం
- అధికారపార్టీ నేతల తీరుపై ప్రజల్లో తీవ్ర అసహనం



వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి గతంలో శంకుస్థాపన చేసిన ప్రాంతం ఇదే



తాజాగా నేడు శంకుస్థాపన చేయనున్న ప్రస్తుత ఆస్పత్రి ఆవరణ

నందిగామటౌన్: నందిగామ వందపడకల ఆస్పత్రి నిర్మాణం విషయంలో కూటమి నేతల తీరు ఏమాత్రం మారలేదు. ప్రజాప్రయోజనాల కంటే రాజకీయ స్వప్రయోజనాలే ముఖ్యం అన్నట్లుగా పాలకులు వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది. 2024 మార్చి ఏడో తేదీన అప్పటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నందిగామలోని రామన్నపేట రోడ్డులో జాతీయ రహదారికి సమీపంలో ప్రభుత్వం సేకరించిన ఐదెకరాల స్థలంలో ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణకుమార్, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు ఆధ్వర్యంలో అప్పటి విజయవాడ ఎంపీ, ప్రభుత్వాధికారుల సమక్షంలో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడటంతో పనులు ప్రారంభం కాలేదు. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఏడాదిన్నరగా ఆస్పత్రి పనులు ప్రారంభానికి నోచుకోకపోవడం ప్రజల పాలిటశాపంగా మారింది.

నేడు మళ్లీ శంకుస్థాపన..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సేకరించిన స్థలంలో వందపడకల ఆస్పత్రి నిర్మాణం చేపట్టకూడదనే దురాలోచనతో పాలకులు తాజాగా అత్యంత రద్దీగా ఉండే ప్రస్తుత ఆస్పత్రి ప్రాంగణంలోనే వంద పడకల ఆస్పత్రిని నిర్మించాలని తలపెట్టడంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆస్పత్రి ఆవరణ కేవలం 2.4 ఎకరాల విస్తీర్ణంలో ఉండగా, అదేప్రాంతంలో నాలుగు అంతస్తుల్లో వంద పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శుక్రవారం మరోసారి శంకుస్థాపన చేసేందుకు అధికారపార్టీ నేతలు పూనుకుంటుండటం గమనార్హం. వంద పడకల ఆస్పత్రి ఇక్కడే నిర్మిస్తే అందులో పనిచేసే వైద్యసిబ్బంది, రోగుల వాహనాల పార్కింగ్‌తోపాటు ఇతర సదుపాయాల కల్పనకు ఇబ్బందులు తప్పవు. రోగులు సైతం వాహనాల శబ్ద, వాయి కాలుష్యం మధ్యే వైద్యసేవలు పొందాల్సిన దుస్థితి తలెత్తనుంది.

రాజకీయ లబ్ధికోసమేనా?..

రాజకీయాలకు అతీతంగా విద్య, వైద్య రంగాలను అభివృద్ధి చేయాల్సి ఉండగా, వంద పడకల ఆస్పత్రి నిర్మాణ స్థలం మార్పు కేవలం రాజకీయ లబ్ధికోసమే అనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రస్తుత ఆస్పత్రి ప్రాంగణంలో 50 పడకల ఆస్పత్రి నిర్వహణే కష్టసాధ్యంగా ఉండగా, ఇక వంద పడకల ఆస్పత్రి కడితే పరిస్థితి ఏమిటనే చర్చ వైద్యశాఖ వర్గాల్లోనూ సాగుతోంది. వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి సుమారు ఐదెకరాల స్థలమైనా ఉండాలని వైద్య విధాన పరిషత్ అధికారులు చెబుతుండగా, ఆ అంశాన్ని పాలకులు పట్టించుకోకుండా ఇక్కడే నిర్మాణం చేపట్టేందుకు సిద్ధం కావడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వాస్పత్రికి చేరుకునేందుకు ఉన్న ప్రధాన రహదారులన్నీ ఇరుకుగా ఉండటంతోపాటు వాహనాలు, ఆయా పనులపై నందిగామకు వచ్చే ప్రజలతో నిత్యం రద్దీగా ఉంటాయి. అత్యవసర సమయాల్లో ఈ రోడ్లలో రోగులను ఆస్పత్రికి తీసుకురావడం అత్యంత ప్రయాసతో కూడిన పని అని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ప్రస్తుత ఆస్పత్రి స్థలం వంద పడకల ఆస్పత్రి నిర్మాణానికి అనువుగా లేదని రాష్ట్ర మెడికల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సైతం గతంలో పేర్కొనడాన్ని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు.



ఆస్పత్రి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్సీ డాక్టర్ అరుణకుమార్, అప్పటి ప్రజాప్రతినిధులు, ఆఫీసర్లు(ఫైల్)

● ఐదెకరాల స్థలం సైతం సేకరణ..

నందిగామ ప్రాంతంలో పెరుగుతున్న జనాభా అవసరాలకు అనుగుణంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వందపడకల ఆస్పత్రి నిర్మాణానికి ఐదెకరాల స్థలాన్ని సేకరించేందుకు అనుమతులు జారీ చేసింది. పట్టణంలో ఎకరం భూమి ధర కోట్లల్లో ఉన్నప్పటికీ ఎమ్మెల్సీ డాక్టర్ అరుణ కుమార్, అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ జగన్‌మోహనరావు రైతులతో మాట్లాడి ఎకరం రూ. 50 లక్షల చొప్పున ఆస్పత్రి నిర్మాణానికి అందించేలా వారిని ఒప్పించారు. స్థలానికి సంబంధించిన రూ.2.5 కోట్లను రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు కూడా అప్పటి ప్రభుత్వం పాలనాపరమైన అనుమతులతోపాటు గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది. అంతే కాకుండా ఆస్పత్రి రాకపోకలకు అవసరమైన 18 సెంట్ల స్థలాన్ని సైతం దాతలు పెద్దమనస్సుతో ఉచితంగా అందజేశారు. ఇలా భవిష్యత్ అవసరాల దృష్ట్యా వందపడకల ఆస్పత్రి భవన నిర్మాణ పనులను సువిశాలస్థలంలో చేపట్టాల్సి ఉండగా, కూటమి పాలకులు మాత్రం మా ప్రభుత్వం... మాఇష్టం అన్న రీతిలో వ్యవహరిస్తూ ఇరుకుగా ఉన్న ప్రస్తుత ప్రభుత్వాస్పత్రి ఆవరణలోనే నిర్మించేందుకు సిద్ధమవుతుండటంపై ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇకనైనా ప్రజల ఇబ్బందులు, భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని గతంలో శంకుస్థాపన చేసిన స్థలంలోనే వంద పడకల ఆస్పత్రిని నిర్మించాలని నందిగామ నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

కేవీకే సందర్శన



గరికపాడు(జగ్గయ్యపేట): వ్యవసాయ శాస్త్రవేత్తలు వ్యవసాయ పరిశోధనా స్థానానికే పరిమితం కాకుండా పంటలసాగులో రైతులకు తగిన సలహాలు ఇవ్వాలని గుంటూరు లాంఫాం పరిశోధనా సంచాలకుడు డాక్టర్ ఎన్వీఎస్ దుర్గాప్రసాద్ సూచించారు. గరికపాడు కృషి విజ్ఞానకేంద్రం(కేవీకే)ను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలోని పంటలను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ దత్తత గ్రామాల్లో కొత్త రైతులను క్షేత్రానికి పరిచయం చేసి పంట దిగుబడులపై వారికి అవగాహన కల్పించాలన్నారు. 2025–26 కార్యాచరణ ప్రణాళికలను సమీక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ రవికిషోర్, శాస్త్రవేత్తలు ప్రభావతి, రాజశేఖర్, శివప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార ప్రాధాన్యంపై అవగాహన

నందిగామరూరల్:పౌష్టికాహారం తీసుకుంటే అనారోగ్యసమస్యలు దరిచేరవని ఐసీడీఎస్ సీడీపీవో లక్ష్మీభార్గవి సూచించారు. పట్టణంలోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో గురువారం సంకల్ప అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పౌష్టికాహార లోపాన్ని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విజయవాహిని ఫౌండేషన్, టాటా ట్రస్ట్ వైద్యురాలు భార్గవి, శారద ట్రస్ట్ సూపర్‌వైజర్ భాగ్యలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వెంకట్రావమ్మ, కరీమా, తారాభి, కరుణకుమారి, శ్రీదేవి, శ్రీలత, హర్షిత్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి : తన్నీరు



ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి కాటేపల్లి రవిని సన్మానిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేటఅర్బన్: వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల్లో నూతనంగా నియమితులైన నేతలు పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆ పార్టీ జగ్గయ్యపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు సూచించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రచార విభాగం కార్యదర్శిగా నియమితులైన కాటేపల్లి రవిని తన్నీరు నాగేశ్వరరావు స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా సత్కరించారు. పార్టీ కోసం పనిచేసేవారిని పదవులు తప్పకుండా వరిస్తాయని పేర్కొన్నారు. కాటేపల్లి రవి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన తన్నీరు నాగేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని వివరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, మంగొల్లు గ్రామపార్టీ అధ్యక్షుడు బొల్లం కిరణ్, యూత్ పట్టణ ప్రధానకార్యదర్శి గొట్టిపాళ్ల సురేష్, ప్రదీప్ తమ్మినేని తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల పాఠశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన



ఇబ్రహీంపట్నంలో దివ్యాంగుల హాస్టల్ వద్ద ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

ఇబ్రహీంపట్నం: ఓ ప్రైవేట్ సంస్థకు చెందిన దివ్యాంగుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కనిపించడం లేదని, తమ బిడ్డను వెంటనే తమకు అప్పగించాలని విద్యార్థి తల్లిదండ్రులు గురువారం పాఠశాల వద్ద ఆందోళనకు దిగారు. సేకరించిన వివరాల ప్రకారం.. పెనుగంచిప్రోలు మండలం అనిగండ్లపాడు గ్రామానికి చెందిన జోజిబాబు, జ్యోత్స్న దంపతుల కుమారుడు సన్నీని పదో తరగతి నిమిత్తం దివ్యాంగుల పాఠశాలలో చేర్పించారు. తన కుమారుడిని చూసేందుకు వచ్చిన తల్లికి కుమారుడు లేడనే విషయం తెలుసుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసుల జోక్యంతో పాఠశాల యజమాని కూడా మా హాస్టల్ విద్యార్థి కనిపించడంలేదని పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించింది. కుమారుడి తల్లిదండ్రులు స్థానికులతో కలిసి దివ్యాంగుల హాస్టల్ వద్ద ఆందోళన చేసి తమ బిడ్డను హాస్టల్ నిర్వాహకులే ఏదో చేశారని ఆరోపించారు. తమ బిడ్డను తక్షణం తమకు అప్పగించాలని డిమాండ్ చేశారు. విద్యార్థి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పోలీసుల అదుపులో హాస్టల్ నిర్వాహకురాలు

విద్యార్థుల తల్లిదండ్రులు జోజిబాబు, జ్యోత్స్న ఇచ్చిన ఫిర్యాదుతో హాస్టల్ నిర్వాకురాలు వసంత కుమారిని గురువారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. హాస్టల్ నిర్వహణకు అనుమతులు కూడా లేవని వారు చెబుతున్నారు. బాధితులకు న్యాయం చేయాలని, అలా జరగని పక్షంలో పోలీస్‌స్టేషన్ ముట్టడిస్తామని ఎమ్మార్పీఎస్ నాయకులు హెచ్చరించారు.

హామీలు నెరవేర్చాలని డిమాండ్



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్, నాయకులు

చందర్లపాడు(నందిగామరూరల్):భవన నిర్మాణ కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ విమర్శించారు. ఏపీ బిల్డింగ్ అండ్ అదర్ కన్‌స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ పిలుపుమేరకు ఈనెల 15న రాష్ట్ర లేబర్ కమిషనర్ కార్యాలయ ముట్టడి కార్యక్రమ వాల్‌పోస్టర్‌ను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ మండల కార్యదర్శి తోట రామారావుతో కలిసి గురువారం ఆయన ఆవిష్కరించారు. ఈసందర్భంగా గోపాల్ మాట్లాడుతూ రాష్ట్రంలో 25 లక్షలకు పైగా కార్మికులు నిర్మాణ రంగంలో ఉపాధి పొందుతుండగా 18 లక్షల మంది బిల్డింగ్ వర్కర్స్ వెల్ఫేర్ బోర్డులో తమ పేర్లను నమోదు చేసుకున్నారన్నారు. అధికారంలోకి రాగానే వెల్ఫేర్ బోర్డును పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చిన సీఎం చంద్రబాబు, కూటమి నేతలు 15నెలలుగా ఆ ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి భవన నిర్మాణ కార్మికుల సమస్యలను పరిష్కరించడంతోపాటు ఇచ్చిన హామీల అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివారెడ్డి, లాల్, సుభాని, అమీర్‌బాషా మౌలాలి, జాన్ మియా తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన గళం



జగ్గయ్యపేటఅర్బన్: కేంద్రప్రభుత్వ మెమో 57 ప్రకారం డీఎస్సీ–2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్‌ను పునరుద్ధరించాలని డీఎస్సీ–2003 ఉపాధ్యాయులు డిమాండ్ చేశారు. జగ్గయ్యపేట తాలూకా కేంద్రం వద్ద 2003 డీఎస్సీ ఉపాధ్యాయులు, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నాయకులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి మహా నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా డీఎస్సీ–2003 ఉపాధ్యాయుల ఫోరం కన్వీనర్ షేక్ రఫీ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ ఒకటోతేదీకి ముందు విడుదలైన నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలకు ఎంపికై సీపీఎస్ విధానంలో కొనసాగుతున్న సుమారు 11 వేల మంది ఉద్యోగ, ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వ మెమో 57ప్రకారం పాత పెన్షన్ కొనసాగించాలని డిమాండ్ చేశారు.అనంతరం ఇన్‌చార్జి తహసీల్దార్ మనోహర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. నిరసన కార్యక్రమంలో డీఎస్సీ–2003 ఉపాధ్యాయ ప్రతినిధులు నేలవెల్లి రమేష్ బాబు, ఎం.కృష్ణయ్య, అల్లిక నరసింహారావు, షేక్ రఫీ, జె.సుధానంద్, భూక్యా కృష్ణ, జి.రామారావు, కె.సైదులు, వీవీ.కనకదుర్గ, ఎ.కవితారాణి, టి.జయసుధ, మూర్తి, ముక్తేశ్వరరావు, కరుణాకర్ పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: అధికారంలోకి రాగానే పీఆర్సీ ఇస్తామని చెప్పిన కూటమి పాలకులు ఏడాదిన్నర ఆ ఊసెత్తటం లేదని ఏపీటీఎఫ్ బాధ్యులు అజ్మీర శ్రీనివాసరావు, సోహైల్ హుస్సేన్ విమర్శించారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం మండలంలోని ఆయా పాఠశాలల వద్ద ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీఆర్సీ కమిషన్‌ను వెంటనే నియమించి తాత్కాలిక ఉపశమనంగా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రస్ట్ బోర్డు సభ్యుల నియామకం

నందిగామరూరల్: అంబారుపేట సత్యమ్మ అమ్మవారి ఆలయ ట్రస్ట్ బోర్డుకు 11మంది సభ్యులు నియమితులయ్యారు. గ్రామానికి చెందిన మంచాల మాధవరావు, తొండపు పుణ్యవతి, కామసాని రమాదేవి, దర్శి పుష్పావతి, మోదెల నాగమణి, బెల్లంకొండ కాంతారావు, మార్కాపురపు శ్రీనివాసరావు, ఐలపోగు పెద్దరాం బాబు, యర్రబడి మణి, కెవిఎస్ఆర్ రాజేశ్వరరావు, ఎక్స్అఫిషియో సభ్యునిగా నందిగామ వెంకటసుబ్బారావు నియమితులయ్యారు.

ప్రతిభచూపిన విద్యార్థులు

జగ్గయ్యపేట అర్బన్:ఎస్‌సీఈఆర్‌టీ, సర్వశిక్షా అభియాన్ ఆధ్వర్యంలో కృష్ణాజిల్లా అంగలూరు ప్రభుత్వ బాలికల హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి పోటీల్లో జగ్గయ్యపేటకు చెందిన విద్యార్థులు విశేష ప్రతిభను కనపరిచారు. ఈ పోటీల్లో పట్టణంలోని నాగార్జున హైస్కూల్‌కు చెందిన ఎ.యశస్విని(క్లాసికల్ డ్యాన్స్), ఎ.లాస్య(ట్రైబల్ ఫోక్ డ్యాన్స్), డి.నేహశ్రీ(డ్రాయింగ్) పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనపరిచారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.



లోక్ అదాలత్‌తో శాంతియుత పరిష్కారం



న్యాయవాదులతో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

నందిగామరూరల్:వివాదాలను రాజీమార్గం ద్వారా శాంతియుతంగా పరిష్కరించడమే జాతీయ లోక్ అదాలత్ ముఖ్య ఉద్దేశమని 16వ అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి, మండల లీగల్ సర్వీస్ కమిటీ చైర్మన్ పగడాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి గురువారం ఆయన న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఈనెల 13న ఉదయం 10.30 గంటల నుంచి నందిగామ కోర్టు ఆవరణలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. లోక్ అదాలత్‌లతో కక్షిదారులకు అతి తక్కువ సమయంలో సత్వర న్యాయం అందుతుందని తెలిపారు. క్రిమినల్ కేసుల్లో రాజీ పడదగిన కేసులు, సివిల్, వాహన ప్రమాద బీమా కేసులు, చెక్ బౌన్స్ కేసులతోపాటు ఆయా కేసుల్లోని కక్షిదారులు జాతీయ లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవడం ఉత్తమమన్నారు. న్యాయవాదులు కూడా లోక్ అథాలత్‌పై కక్షిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కలిగించాలని సూచించారు. న్యాయవాదులు శర్మ, కొమ్మినేని మౌలేశ్వరరావు, కృష్ణం రాజు, నంద్రు శ్రీరామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.